సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.5,200 ప్రకారం ధర పలికాయి.



ఆటో బోల్తా - మహిళా కూలీ మృతి

డ్రైవింగ్ రాని యువకుడు ఆటో నడవడం వల్ల చోటు చేసుకున్న ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందింది. ఘటనతో పెడపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. 8లో



జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ముగిసిన 'పది' మూల్యాంకనం

పుట్టపర్తి: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్) బుధవారం ముగిసింది. కొత్తచెరువులోని బాల బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన మూల్యాంకనం బుధవారం ప్రశాంతంగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తంగా 891 మంది ఉపాధ్యాయులు, సిబ్బందితో మూల్యాంకనంలో పాల్గొన్నారని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. పరీక్షలు, స్పాట్ విధుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నేడు జిల్లాకు మంత్రి కొల్లు రవీంద్ర

ప్రశాంతి నిలయం: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రబాబు గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అనంతపురంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి... మధ్యాహ్నం 2.25 గంటలకు రోడ్డుమార్గంలో గోరంట్ల మండలంలోని పాలసముద్రం చేరుకుంటారన్నారు. అక్కడ నూతనంగా నిర్మించిన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ (ఏపీఎస్బీసీఎల్) పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అక్కడి నుంచి 'నాసిన్'కు వెళతారని, సాయంత్రం 4 గంటలకు పాలసముద్రం నుంచి బయలుదేరి బెంగళూరు వెళతారని కలెక్టర్ పేర్కొన్నారు.

రేపు పుట్టపర్తిలో పూలే జయంతి వేడుకలు

ప్రశాంతి నిలయం: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి నిర్మలాజ్యోతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు గణేష్ సర్కిల్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీఖానాలో పూలే జయంతి వేడుకలు ఉంటాయన్నారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు వెల్లడించారు. పూలే జయంత్యుత్సవంలో మేధావులు, ప్రజలు, ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని కోరారు.

గాలీవాన బీభత్సం



పుల్లంపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

కణేకల్లు: మండలంలో బుధవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. కణేకల్లు, కె.కొత్తపల్లి, పుల్లంపల్లి, పూలచెర్ల, కణేకల్లు క్రాస్, యర్రగుంట తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. వారం, పది రోజుల్లో కోత కోయాల్సిన తరుణంలో గాలీవాన పంటను దెబ్బతీసింది. ఎకరా మొక్కజొన్న సాగుకు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, వర్షానికి మొత్తం తుడిచి పెట్టుకుపోయిందంటూ బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



భూమయ్యగారిపల్లి వద్ద బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

చిలమత్తూరు మండలం మొరసలపల్లి పంచాయతీ పరిధిలోని భూమయ్యగారిపల్లిలో తలెత్తిన నీటి కష్టాలను తెలిపే చిత్రమిది. రక్షిత మంచినీటి పథకం ఎందుకూ కొరగాకుండా పోవడంతో ప్రజలు వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. పంచాయతీ బోరుబావిలో నీరు పుష్కలంగా ఉన్నా... మోటారు బిగించడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రజలు ఇలా కన్నీటి కష్టాలు పడుతున్నారు. రోజూ పనులు మానుకుని పానిపట్టు యుద్ధాలు చేస్తున్నారు.



ఏప్రిల్ 2: రొళ్ల మండలం అగ్రహారంలో నీటికోసం బైఠాయించిన మహిళలు

మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలం అగ్రహారం గ్రామంలో 255 కుటుంబాలున్నాయి. 960 మంది నివసిస్తున్నారు. గ్రామానికి నీరు సరఫరా చేసేందుకు మూడు బోరుబావులు వినియోగిస్తున్నారు. పైప్‌లైన్‌కు అక్కడక్కడా లీకేజీలు ఉండటంతో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఇటీవల ఎస్సీ కాలనీలో ఓ రైతు వాటర్ వర్క్స్ నుంచి గ్రామానికి నీళ్లు సరఫరా కాకుండా దారి మళ్లించి పొలంలోకి తిప్పుకోవడంతో గ్రామస్తులు నీళ్లు లేవని రోడ్డెక్కారు.



మార్చి 22: బుక్కపట్నం మండలం చిలకలగడ్డపల్లిలో నీటికోసం నిరసన

బుక్కపట్నం మండలం చిలకలగడ్డపల్లి కొట్టాలలో 30 ఇళ్లు ఉండగా... 100 మంది వరకు జీవిస్తున్నారు. మూడు నెలలుగా తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చగా.. చుట్టుపక్కల గ్రామాల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కనీసం ఎమ్మెల్యే సింధూరారెడ్డి అయినా తమ నీటి కష్టాలు తీర్చాలని ఇటీవల ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు.

భూగర్భ జలమట్టం పడిపోవడం.. నీటి పథకాలు పనిచేయకపోవడంతో చుక్కనీటి కోసం గ్రామీణులు దిక్కులు చూస్తున్నారు. రోజుల తరబడి తాగునీరు సరఫరా కాక దాహం కేకలు వేస్తున్నారు. స్పందించాల్సిన పాలకులు చోద్యం చూస్తుండగా ఊరూరా మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లెక్కుతున్నారు. తాగునీరివ్వండి సారూ అంటూ వేడుకుంటున్నారు.



జలం.. జటిలం

ఊరూరా నీటి కష్టాలు

- జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్య
- రోజూ ఏదో చోట రోడ్డెక్కుతున్న ప్రజలు
- పుట్టపర్తి, హిందూపురం, మడకశిరలో దాహం కేకలు
- ధర్మవరంలోనూ సరిపడా అందని తాగునీరు
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో అధికారుల విఫలం
- ప్రజల నీటి సమస్యలు పట్టించుకోని అధికారులు, పాలకులు

సాక్షి, పుట్టపర్తి

వేసవి ఆరంభంలోనే తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది తగినంత వర్షాలు కురవక పోవడం.. భూగర్భ జలమట్టం పడిపోవడంతో బోరుబావులు ఎండిపోయాయి. దీంతో రక్షిత మంచినీటి పథకాలు అలంకార ప్రాయంగా మారాయి. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా సాగు, తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఏ గ్రామంలో చూసినా నీటి సమస్య వెంటాడుతోంది. 'నీళ్లో రామచంద్రా' అంటూ జనం నిట్టూరుస్తున్నారు. తాగునీటి కోసం రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు. అధికారులు సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపుతుండగా... వారం రోజుల్లోనే మళ్లీ నీటి కష్టాలు పునరావృతమవుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు చర్యలు లేకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పుట్టపర్తి, బుక్కపట్నం, ఓడీ చెరువు, లేపాక్షి, మడకశిర, హిందూపురం, రొళ్ల, అగళి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఇప్పటికే ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. అయినా పాలకుల్లో చలనం రాలేదు. ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కిన రోజు మాత్రం రెండు నీటి ట్యాంకర్లను పంపించి చేతులు దులుపుకుంటున్నారు.



మార్చి 21: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నీటికోసం మహిళల నిరసన



మార్చి 28: ధర్మవరం వైఎస్సార్ కాలనీలో ఖాళీ బిందెలతో ప్రజల రాస్తారోకో

పుట్టపర్తిని వెంటాడుతోన్న దాహార్తి..

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో తాగునీటి సమస్య తీవ్రతరమైంది. ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు ఉండగా...తాగునీటి సమస్యతో జనం అల్లాడిపోతున్నారు. మూడు, నాలుగు ఫ్లోర్లలో ఉంటున్న వారు నీరు రాక నరకం చూస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయం వెనుక సందులో రెండురోజులకోసారి అర్ధరాత్రి వేళ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కుతున్నారు. జిల్లా కేంద్రమైనప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని.. సమయానికి నీళ్లు రావడం కష్టంగా మారిందని వాపోతున్నారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకం ఉన్నప్పటికీ.. ఉద్యోగులకు ప్రభుత్వం సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో సమస్య జటిలమైంది. పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని బుక్కపట్నం మండలం చిలకలగడ్డపల్లిలోనూ తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. తాగునీటి కోసం మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఓడీ చెరువు మండలంలోనూ రక్షిత తాగునీటి పథకాలు పనిచేయకపోవడంతో ప్రజలు వ్యవసాయ బోర్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.

12.9 మీటర్లు ప్రస్తుతం జిల్లా భూగర్భ జలమట్టం	**51** వాల్టా చట్టం కింద ఉన్న గ్రామాలు
రూ.**5.87** కోట్లు ఆర్‌డబ్ల్యూస్ ద్వారా కేటాయించిన నిధులు	**284** సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద ఆర్‌డబ్ల్యూస్ ద్వారా చేపట్టిన పనులు

బాలయ్య అడ్డాలో దాహం.. దాహం

సీఎం చంద్రబాబు బావమరిది, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో నెలరోజుల ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. ఏ వార్డులో చూసినా నీటి సమస్య వెంటాడుతోంది. ట్యాంకర్ రూ.500 వెచ్చించి నీరు కొనుగోలు చేసి వినియోగిస్తున్న దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యే చుట్టపు చూపుగా వచ్చి వెళ్తారని.. సమస్యలు పరిష్కరించే వారే లేరని చెబుతున్నారు. లేపాక్షి మండలంలోనూ తాగునీటి కోసం ఇటీవల మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గుక్కెడు తాగునీరివ్వలేని పాలకుల తీరును నిరసించారు.

మంత్రి ఇలాకాలో తీరని కష్టాలు..

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరం పట్టణంలో నీటి సమస్య వేధిస్తోంది. సరైన సమయానికి నీరు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రతరం కాగా, రెండు రోజుల కిందట ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించడంలో విఫలం అవుతున్నారని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఏనాడూ నీటి సమస్య కనిపించలేదని ప్రజలే చెబుతున్నారు.

మడకశిర వ్యాప్తంగా నీటియుద్ధాలు..

కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా నీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ఏ గ్రామంలో చూసినా తాగునీటి కష్టాలే కనిపిస్తున్నాయి. దీనికి తోడు చాలా గ్రామాలు వాల్టా చట్టం పరిధిలో ఉండటంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. పాలకులు గ్రామాలకు నీళ్లు ఇవ్వక.. ప్రజలు బోర్లు వేసుకోలేక.. నానా అవస్థలు పడుతున్నారు. మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లో ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి నిరసన తెలిపారు. పొలాల్లోని బోర్ల వద్ద నీటి కోసం యుద్ధాలకు దిగుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులెక్కడ?

గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది వేసవికి సంబంధించి రూ.5.87 కోట్లతో 284 పనులను చేపట్టినట్లు ఆ శాఖాధికారులు పేర్కొన్నారు. అయితే ఏ గ్రామంలో చేపట్టారో.. ఎక్కడ సమస్య పరిష్కరించారో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇందులో 85 చోట్ల బోరుబావుల తవ్వకానికి రూ.85 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కానీ ఆ పనులెక్కడా కనిపించడం లేదు.

ముందస్తు చర్యలేవీ?

జిల్లాలోని 51 గ్రామాలు వాల్టా చట్టం పరిధిలో ఉండగా ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. కానీ ఆ దిశగా యంత్రాంగం చర్యలు తీసుకోలేదు. పాలకులూ కనీసం పట్టించుకోలేదు. ఇక ఇతర ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేసే అవకాశం ఉన్నా...ఎవరూ స్పందించడం లేదు. కేవలం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే నీటి సమస్యకు కారణమని జనం అంటున్నారు. ముఖ్యంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించడంలో యంత్రాంగం విఫలమైందంటున్నారు.

మూడు నెలలుగా నీటి సరఫరా బంద్



కమతంపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న నీటి సంపు

గాండ్లపెంట: ఎన్‌పీకుంట, గాండ్లపెంట మండలాల్లోని గ్రామాలకు 'సత్యసాయి మంచినీరు' మూడు నెలలుగా సరఫరా కావడం లేదు. దీంతో ఈ రెండు మండలాల్లోని 68 గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలంగా మారింది. ఆయా గ్రామాలకు సత్యసాయి నీరు సరఫరా చేసేందుకు సీఈఆర్ నుంచి కాళసముద్రానికి అక్కడి నుంచి కుటాగుళ్లకు అక్కడి నుంచి కమతంపల్లికి నీరు సరఫరా చేస్తారు. ఇందుకోసం కమతంపల్లిలో 8.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు సంపులు నిర్మించారు. కానీ మూడు నెలలుగా నీరు సరఫరా చేయడం లేదు. దీంతో గాండ్లపెంట, ఎన్‌పీకుంట మండలాల్లోని జనం తాగునీటికి అల్లాడుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ధర్మవరంలో శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రణాళికలు
- వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: వేసవి తీవ్రతరమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా ధర్మవరం నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి ఎంతమేర నిధులు అవసరమో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నియోజకవర్గంలో 85 చెరువుల అభివృద్ధికి 96 పనులు ఆమోదించి రూ.179.9 లక్షలు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. అలాగే ట్రిబుల్ ఆర్ ద్వారా 21 చెరువుల అభివృద్ధికి రూ.795 లక్షలు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్, పీఏబీఆర్ కాలువల ద్వారా 14 చెరువులకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్ ప్రాజెక్టును రూ.60 లక్షలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నియోజకవర్గంలో తాడిమర్రి, ముదిగుబ్బ, ధర్మవరం అర్బన్‌లో తీవ్ర నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మవరం మున్సిపాలిటీలోని శ్మశాన వాటికను హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న ఐదేళ్లలో అర్హులైన వారందరికి ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గంలో 15,830 ఇళ్ల నిర్మాణాలకు ఆమోదం తెలిపామని, అర్బన్ ప్రాంతాల్లో 13 వేల ఇళ్ల నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మైనర్ ఇరిగేషన్ అధికారి విశ్వనాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, హౌసింగ్ అధికారి శంకరయ్య, ఉద్యానశాఖ, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

13న యూపీఎస్సీ ఫ్లాగ్‌షిప్ పరీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీకి సంబంధించి ఈనెల 13న ఉమ్మడి అనంతపురం జిల్లా అభ్యర్థులకు ఫ్లాగ్‌షిప్ పరీక్ష జరగనుంది. రెండు కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 363 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. యూపీఎస్సీ నిబంధనలను అనుసరించి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి' అని అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరుగుతాయన్నారు. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.రామ్మోహన్, రూట్ ఆఫీసర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, కేఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, రూట్ అధికారిగా వి.మల్లికార్జునరెడ్డిని నియమించామన్నారు. కేంద్రం వద్ద ఒక ఎస్ఐ, ఇద్దరు పురుష, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష వేళలకు అనుకూలంగా బస్సులు నడపాలని ఆదేశించారు. 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

పరీక్ష సమయాలు ఇలా...

- ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష జరుగుతుంది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు పేపర్-2, 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పేపర్-3 పరీక్ష జరుగుతుంది.
- కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళ కళాశాల పరీక్ష కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్షకు సంబంధించి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 జరుగుతుంది.
- అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి.
- ఈ-అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పెన్, పెన్సిల్ తీసుకువాల్సి ఉంటుంది.
- మొబైల్ ఫోన్లు, డిజిటల్, స్మార్ట్ గడియారాలు, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.

'పరిటాల' పతనం ప్రారంభమైంది

- కురుబ లింగమయ్య హత్య దుర్మార్గం
- పాపిరెడ్డిపల్లిలో విశ్రాంత జిల్లా జడ్జి ఎం.కృష్ణప్ప
- కురుబల జోలికొస్తే ఖబడ్దార్
- హెచ్చరించిన కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు



మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి కృష్ణప్ప



మాట్లాడుతున్న రాజహంస శ్రీనివాసులు

రామగిరి: కురుబ లింగమయ్య హత్యతో పరిటాల కుటుంబం రాజకీయ పతనం ప్రారంభమైనట్లేనని విశ్రాంత జిల్లా జడ్జి ఎం.కృష్ణప్ప అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగ బద్ధంగా రాజకీయాలను ఎదుర్కోలేక హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం సబబు కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల టీడీపీ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను కురుబ సంఘం నాయకులు బుధవారం పాపిరెడ్డిపల్లికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా లింగమయ్య కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కురుబలు రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక హత్యలకు తెగబడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం విశ్రాంత జడ్జి కృష్ణప్ప మాట్లాడుతూ.. లింగమయ్య హత్య కేసు పక్కదోవ పట్టించకుండా నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏకపక్ష వైఖరి వీడి.. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. చట్టం ఎవరి చుట్టం కాదని.. చట్టానికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి పోలీసుపై ఉందన్నారు. లింగమయ్య హత్య కేసును సీబీ సీఐడీకి బదిలీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి లేదన్నారు. ఎస్ఐ తన పరిధి మేరకు.. తాను చేసే వృత్తిలో నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తే మంచిదని సూచించారు. సుధాకర్ యాదవ్ సక్రమంగా విధులు నిర్వర్తించి ఉంటే లింగమయ్య హత్య జరిగేది కాదని జనం నోట నానుతోందన్నారు.

కురుబల జోలికొస్తే ఖబడ్దార్..

కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు మాట్లాడుతూ.. కురుబల జోలికొస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో వ్యవసాయం చేసుకునే రైతు లింగమయ్యను హత్య చేయడం దారుణమన్నారు. రామగిరిలో ఏ రాజ్యాంగం అమలులో ఉందో అర్థం కావడం లేదన్నారు. హత్యారాజకీయాలను ప్రోత్సహించడం రాజకీయం కాదని హితవు పలికారు. కురుబ కులస్తులు సౌమ్యులని.. ఎవరి జోలికీ పోరని.. అలా అని రాజకీయం అంటగట్టి హత్యలకు తెగబడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. లింగమయ్యను హత్య చేసిన వారికి కఠిన శిక్ష పడే వరకు పోరాడతామన్నారు. అంతకుముందు లింగమయ్య భార్య రామాంజినమ్మ, పెద్దకుమారుడు మనోహర్, ఆయన భార్య రేణుక, చిన్న కుమారుడు శ్రీనివాసులు, కుమార్తె ప్రమీలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను కురుబ సంఘం నాయకులు పరామర్శించారు.

క్లుప్తంగా

ఫాదర్ ఫెర్రర్‌కు ఘన నివాళి



ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అన్నేఫెర్రర్, తదితరులు

బత్తలపల్లి: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతిని బత్తలపల్లిలోని ఫీల్డ్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మనువరాలుతో కలసి ఫెర్రర్ ఘాట్ వద్ద ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఘాట్‌పై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆర్డీటీ పనిచేస్తుందని తెలిపారు. కాగా, గురువారం అన్నే ఫెర్రర్ పుట్టినరోజు కావడంతో పలువురు ముందుగానే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పాల్, ఆర్డీ ప్రమీల, సీఎస్సీ రఘు, ఆసుపత్రి ఇన్‌చార్జ్ హనుమంతరెడ్డి, ఆర్డీటి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి



మృతురాలు ఆదిలక్ష్మమ్మ

చిలమత్తూరు: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. చిలమత్తూరు మండలం పాతచామలపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (52) హిందూపురంలో నివాసముంటూ ముదిరెడ్డిపల్లిలో చేనేత పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తన స్వగ్రామానికి వచ్చిన ఆమె బుదవారం చిలమత్తూరు నుంచి హిందూపురం వైపు వెళుతున్న ప్రైవేటు బస్సులో తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో బైరేకుంట సమీపంలోకి చేరుకోగానే మలుపు వద్ద డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపడంతో అదుపు తప్పి ఆదిలక్ష్మమ్మ బస్సు డోరులో నుంచి రోడ్డుపైకి వచ్చి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని అక్కడే ఆపి ఉడాయించాడు. ఘటనపై ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహితపై అత్యాచార యత్నం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం ఎర్రపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు చంద్ర అత్యాచార యత్నం చేశాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వరి కల్లాల వద్ద ఒంటరిగా ఉన్న వివాహితను గమనించిన చంద్ర అత్యాచారం చేయబోతే ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. ఆ సమయంలో ఆమె గొంతు, మెడపై దాడి చేసి యువకుడు పరారయ్యాడు. బుధవారం ఉదయం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తండ్రి కోసం తనయ పోరాటం

కుటుంబాన్ని పోషించేందుకు ఆ తండ్రి రెక్కలు ముక్కలు చేసుకుని బండరాళ్లు కొట్టాడు. మండుటెండలో పునాది రాళ్లను కొడుతూ అహర్నిశలు శ్రమించాడు. నాలుగు రాళ్లు సంపాదించి కుమార్తెలకు పెళ్లిళ్లు చేయాలనే తపనతో ఆకలి దప్పికలు మరిచాడు. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచింది. విధి వక్రీకరించి మంచానపడ్డాడు. ఏనాడూ గడప దాటి ఎరుగని కుమార్తె.. నేడు తండ్రి వైద్యం ఖర్చులు, కుటుంబ పోషణ కోసం పలువురి ఇళ్లలో పనులకు వెళుతోంది. మెరుగైన వైద్యం అందిస్తే తన తండ్రి మామూలు మనిషిగా మారుతాడని, అయితే వైద్యానికి అయ్యే ఖర్చు తమ తలకు మించిన భారం కావడంతో ఆపన్నహస్తమందించాలని నిరుపేద కుటుంబం వేడుకుంటోంది.

- అనారోగ్యంతో మంచానపడ్డ తండ్రి
- సపర్యలు, ఇంటి పనుల్లో నిమగ్నమైన తల్లి
- కుటుంబ పోషణ, తండ్రి వైద్యం కోసం ఇళ్ల పనికి వెళ్తున్న కుమార్తె
- మెరుగైన వైద్యం కోసం ఆపన్న హస్తమందించాలని వేడుకోలు





శ్రీనివాసులును ఆదుకోవాలని కోరుతున్న భార్య లక్ష్మి, కుమార్తె జ్యోతి, మంచానికే పరిమితమైన శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: స్థానిక మహాత్మాగాంధీ కాలనీకి చెందిన మల్లిపోగుల శ్రీనివాసులు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పునాదులకు అవసరమైన రాళ్లను కొడుతూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అరకొర సంపాదనలోనే దాచుకుంటూ వచ్చిన డబ్బుతో పెద్ద కుమార్తె శిరీషకు పెళ్లి చేసి, అత్తారింటికి పంపారు. చిన్న కుమార్తె జ్యోతిని పదో తరగతి వరకు చదివించగలిగారు. అపై చదువులకు పంపే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంచేశారు.

సాధారణ జబ్బు కాదది

నెల రోజుల క్రితం మహాశివరాత్రి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు శ్రీనివాసులు కుటుంబం సిద్ధమైంది. ఉదయం తలంటి స్నానం చేసిన తర్వాత ఇంట్లో పూజలు చేసుకుని ఆలయానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా శ్రీనివాసులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. పరిస్థితి గమనించిన భార్య లక్ష్మి, కుమార్తె జ్యోతి వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీనివాసులుకు రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమిస్తుండడంతో వెంటనే కర్నూలులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డయాలసిస్ చేయడంతో కాస్త ఉపశమనం దక్కింది. ఈ క్రమంలో ఎడమ కాలికి ఇన్‌ఫెక్షన్ సోకి సెప్టిక్ కావడంతో పెద్ద గాయమైంది. దీంతో శ్రీనివాసులు కనీసం కూర్చొనే పరిస్థితి కూడా లేకపోయింది.

సాయం చేయదలిస్తే...

పేరు :మల్లిపోగుల లక్ష్మి
బ్యాంకు పేరు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ధర్మవరం బ్రాంచ్
ఖాతా నెంబరు : 9103 349 4823
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : APGB0001029
సంప్రదించాల్సిన నంబర్ : 78424 68672

ఇంటి వద్ద మంచానికే పరిమితం

ఎడమ కాలికి కట్టు కట్టిన తర్వాత కర్నూలు ఆస్పత్రి నుంచి వైద్యులు డిశ్చార్జ్ చేసి, ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో మరోసారి డయాలసిస్ అవసరం కావడంతో ఆస్పత్రికి తీసుకెళితే.. శ్రీనివాసులు పరిస్థితిని గమనించిన వైద్యులు డయాలసిస్ చేయడానికి సాధ్యం కాదని వెనక్కు పంపారు. అప్పటి నుంచి ఇంట్లోనే మంచానికే ఆయన పరిమితమయ్యాడు. ఈ మొత్తం ప్రక్రియలో ఇంట్లో చిన్న కుమార్తె పెళ్లికని దాచిన డబ్బు మొత్తం శ్రీనివాసులు చికిత్స కింద ఖర్చయి.. మరికొంత తెలిసిన వారి వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది. నిరుపేద కుటుంబం కావడంతో రోజూ పనికి వెళితే తప్ప పూట గడవని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఇంటి వద్ద భర్తకు సపర్యలు చేయడంలోనే భార్య లక్ష్మికి సమయం సరిపోతోంది. దీంతో ఏనాడు గడప దాటి ఎరుగని చిన్న కుమార్తె జ్యోతి.. తండ్రి ఆరోగ్యం మెరుగుపడాలనే తపనతో తొలిసారిగా ఇల్లు విడిచి బయట కూలి పనులకు సిద్ధమైంది. ఇంటింటికీ తిరిగి వారికి అవసరమైన పనులు చేసి పెట్టి, వారిచ్చిన కొద్ది పాటి డబ్బుతో తండ్రికి అవసరమైన మందులు, కాలికి డ్రస్సింగ్ చేసేందుకు అవసరమైన మందులు, డయపర్స్ కొనుగోలు చేస్తోంది. వీరి దుస్థితిని గమనించిన చుట్టుపక్కల వారు అప్పుడప్పుడు చిన్నపాటి సాయం అందిస్తున్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు.

తన తండ్రి మంచాన పడటంతో కుటుంబ పోషణ భుజాల మీదకు వేసుకున్న జ్యోతి ఇంటి పనులతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. అయితే తన సంపాదనతో తండ్రి ఆరోగ్యం ఎన్నటికీ బాగుపడదని గుర్తించిన ఆమె ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది. తన తండ్రికి మెరుగైన వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని దాతలను వేడుకుంటోంది.

ఆటో బోల్తా - మహిళా కూలీ మృతి



మృతురాలు రాధ



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బంధువులు

- న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబసభ్యుల ధర్నా

పుట్టపర్తి అర్బన్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ మహిళా కూలీ మృతి చెందారు. పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. పుట్టపర్తి రూరల్ పీఎస్ ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామానికి చెందిన రైతు జలీల్ పొలంలో వేరుశనగ పంట తొలగించేందుకు రోజూ లాగే బుధవారం ఉదయం 9 గంటలకు ఏడుగురు కూలీలతో ఆటో బయలుదేరింది. తమ సొంత ఆటోలోనే కూలీలను తీసుకుని జలీల్ కుమారుడు ఫారూక్ బయలుదేరాడు. గ్రామ శివారుకు చేరుకోగానే 342వ జాతీయ రహదారి మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక దూసుకెళ్లడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ పక్కనే కూర్చున్న మహిళా కూలీ రాధ (32) ఆటో కింద పడడంతో కాలు, చెయ్యి విరిగాయి. ఫారూక్ తల్లి షేక్ మౌసిన్‌భాను తలకు తీవ్ర గాయమైంది. చెయ్యి విరిగింది. మరో కూలీ లక్ష్మీదేవి చెవి తెగిపడింది. సుకన్య, సరస్వతి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను పెడపల్లిలోని ఓ ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించి, ప్రైవేట్ కారులో అనంతపురానికి తరలిస్తుండగా రాధా పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మౌసిన్‌భానును అనంతపురానికి తరలించారు. లక్ష్మీదేవికి గోరంట్లలో వైద్యం అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పుట్టపర్తి రూరల్ పీఎస్ సిబ్బంది అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలు రాధ భర్త తలారి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ కల్లూరు ప్రసాద్ తెలిపారు. కాగా, రాధాకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

న్యాయం చేయాలని బాధితుల ధర్నా..

రాధ మృతిపై బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తూ బుధవారం రాత్రి ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లి ప్రమాదానికి కారణమైన ఫారూక్ ఇంటి ఎదుట ఉంచి దాదాపు 3 గంటల పాటు ధర్నా చేపట్టారు. ఆటో నడపడం తెలియని ఫారూక్ అతి వేగమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. ఆటోకు ఇన్సూరెన్స్ లేదని, ఫారూక్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా బాధితులు వినలేదు. ప్రమాదం జరిగిన వెంటనే టీడీపీ నేత ఆశ్రయించి అజ్ఞాతంలోకి వెళ్లిన ఫారూక్, ఆయన కుటుంబసభ్యులతో కనీసం మాట్లాడే ప్రయత్నం కూడా పోలీసులు చేయకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

హాకీ టోర్నీ విజేత 'కాకినాడ'

- ధర్మవరంలో జాతీయ స్థాయి హాకీ టోర్నీ నిర్వహణకు కృషి : మంత్రి



మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా విజేత ట్రోఫీని అందుకుంటున్న కాకినాడ జట్టు

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 15వ రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ హాకీ టోర్నీ విజేతగా కాకినాడ జిల్లా జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా జట్టుతో తలపడిన కాకినాడ జట్టు ఆది నుంచి ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 2-0 గోల్స్ తేడాతో విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్.. విజేత జట్టును అభినందిస్తూ ట్రోఫీని అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన వైఎస్సార్ జిల్లా జట్టుకు ధర్మవరం షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు వీరనారాయణ, మూడో స్థానంలో నిలిచిన అన్నమయ్య జిల్లా జట్టుకు చేనేత నాయకురాలు జయశ్రీ బహుమతులు, ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధర్మవరంలో జాతీయ స్థాయి హాకీ టోర్నీ నిర్వహణకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ ట్రెజరర్ థామస్ పీటర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపాధ్యక్షుడు గౌరీప్రసాద్, ఉడుముల రామచంద్ర, ఊకా రాఘవేంద్ర, మహమ్మద్ అస్లాం, ట్రెజరర్ అంజన్న, హాకీ కోచ్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాల యాక్షన్ ప్లాన్ విడుదల

ప్రశాంతి నిలయం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 సంవత్సరానికి గాను రుణాల మంజూరుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను బుధవారం విడుదల చేశారు. కార్పొరేషన్ ద్వారా పలు యూనిట్ల ప్రాతిపదికన ఆర్థిక చేయూత రుణాలు అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 11 నుంచి మే 20వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఉంటాయి. మెడికల్ షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, పాసింజర్ కారు, గూడ్స్ ట్రక్ తదితర యూనిట్లకు అవకాశం కల్పించనున్నారు.

వ్యక్తి బలవన్మరణం

పరిగి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పరిగి మండలం వంగలపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... వంగలపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి (53) గతంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా ఓ సోలార్ కంపెనీలో పనిలో చేరిన ఆయన ఇటీవల నూతన గృహాన్ని నిర్మించుకున్నాడు. ఇందుకు గాను రూ.28 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు తీర్చాలంటూ ఒత్తిళ్లు తీవ్రం కావడంతో మంగళవారం రాత్రి ఇంటిపై భాగంలోని రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య భాగ్యమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు శంకర్‌గోవిందు

ధర్మవరం అర్బన్: స్థానిక సత్యసాయినగర్‌కు చెందిన శంకర్ గోవిందు (70) ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం సిద్దయ్యగుట్టలో ఉన్న తన తల్లిని పలకరించి, రాత్రి సమయంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో పట్టాలపై వస్తున్న రైలును గమనించకుండా రైల్వే గేటు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య చౌడమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న హిందూపురం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి బుదవారం ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు ఆంజనేయులు

అగళి: ద్విచక్ర వాహన చోదకులు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం వద్రుపాలెం గ్రామానికి చెందిన ఆంజనేయులు (42) శిర నుంచి స్వగ్రామానికి వెళుతుండగా అగళి మండలం వడగుంటనహళ్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా దొక్కలపల్లి గ్రామానికి చెందిన రాకేష్, రంగనాథ్ వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో రోడ్డు పక్కన కిందపడిన ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాకేష్, రంగనాథ్‌ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కర్ణాటకలోని శిర ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సుధాకర్.. ఓ అక్రమాల పుట్ట

- రూ.కోట్ల విలువైన భూమి ఎలా కొన్నావ్?
- భారీ ఎత్తున కోళ్లఫారం నిర్మాణం ఎలా చేపట్టావ్?
- భూమి చదును కోసం లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల నుంచి మట్టిని అక్రమంగా తోలుకోలేదా?
- చిలమత్తూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

చిలమత్తూరు: 'మాజీ సీఎం వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత, స్థాయి రెండూ రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌కు లేవు. ఆయనో అక్రమాల పుట్ట' అంటూ చిలమత్తూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. బుధవారం హిందూపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధాకర్ యాదవ్ నీతి, నిజాయితీ గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. చిలమత్తూరు పంచాయతీ తుమ్మలకుంట సమీపంలో సుధాకర్ యాదవ్ తన భార్య పేరిట 3.71 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, రూ.కోట్లు విలువ చేసే ఆ భూమిని ఎలా కొనుగోలు చేశారో సమాధానమివ్వాలన్నారు. ఇదే భూమిలో రూ.కోట్ల ఖర్చుతో కోళ్ల ఫారం ఎలా నిర్మిస్తున్నారో కూడా సమాదానం చెప్పాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఏకంగా రూ.16 లక్షలు ఖర్చు పెడుతున్నారంటే సుధాకర్ యాదవ్ అక్రమ సంపాదన ఏపాటిదో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఉపాధి నిధులతో అక్రమంగా తన భూమిలో రోడ్డు వేయించుకున్నాడని ఆరోపించారు. తమ భూమి చదును చేయించుకునేందుకు లేపాక్షి నాలెడ్జి భూముల్లో మట్టిని అక్రమంగా తోలించుకున్న సుధాకర్ యాదవ్‌పై పత్రికల్లో పలు కథనాలు వెలువడినా అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదంటే ఆయన వెనుక ఎవరున్నారో అర్థమవుతోందన్నారు. ఇన్ని లోటుపాట్లు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను ఏకవచనంతో సంబోధించడం సిగ్గుచేటన్నారు. అధికార టీడీపీ నేతలను అడ్డు పెట్టుకుని అక్రమ దందాలతో సామాన్య ప్రజలను ఇక్కట్లు పెట్టే ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పురమాయించడం ఆయన అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రోద్బలంతో విచక్షణ కోల్పోయి మాజీ సీఎంను లక్ష్యంగా చేసుకుని దుర్మార్గంగా మాట్లాడితే సహించబోమన్నారు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని, కాలం ఒకేలా ఉండదనే విషయాన్ని ఇప్పటికైనా ఆయన గుర్తించాలన్నారు.

జెడ్పీలో 10 మందికి పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న పది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరికి ఉత్తర్వులను బుధవారం తన చాంబర్‌లో జెడ్పీసీఈఓ రామచంద్రారెడ్డితో కలసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అందజేశారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో పరిచేస్తున్న డి.మాధవి చౌదరికి పదోన్నతి కల్పిస్తూ తిరిగి జెడ్పీనే కేటాయించారు. ఇదే కార్యాలయంలో పని చేసే బి.సుశీలాదేవిని పెనుకొండలోని పీఆర్ క్యూసీ సబ్ డివిజన్‌కు, కె.రమాదేవిని చిలమత్తూరు మండల పరిషత్ కార్యాలయానికి, విజయవాడలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎం.అరుణశ్రీని యల్లనూరు మండల పరిషత్ కార్యాలయానికి కేటాయించారు. తొగరకుంట హైస్కూల్‌లో పని చేస్తున్న పి.షాహీనా బేగంను రొద్దం మండల పరిషత్ కార్యాలయానికి, పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే జి.రవీంద్రను పుట్టపర్తి పీఆర్ అనుబంధం పీఐయూ సబ్ డివిజన్‌కు, సిద్ధరాంపురం జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే జె.సుబ్రహ్మణ్యంను లేపాక్షి మండల పరిషత్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. ఎద్దులపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే పి.ఉమామహేశ్వరరెడ్డిని గుత్తిలోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్‌కు, నాగసముద్రం జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే వి.విశ్వనాథ్‌ను మడకశిర పీఆర్ఐ సబ్ డివిజన్‌కు, రాయదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే పి.మహేష్‌ను కణేకల్లు మండల పరిషత్ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు.